

# చీకటి వెలుగు

సామాజిక రాజకీయ ఆధ్యాత్మిక సాయంకాలపు దిన పత్రిక

నల్లగొండ, హైద్రాబాద్ | సంపుటి : 19 | సంచిక :107 | ఎడిటర్ : కంది సూర్యనారాయణ | 02-09-2026 బుధవారం | పేజీలు : 4 | వెల : రూ. 3



చీకటి వెలుగు దినపత్రిక

भास्कर वाणि दिन पत्रिक

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇంచార్జీలు, ఫొటోగ్రాఫర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు, డీటీపీ ఆపరేటర్లు కావలెను

ఎడిటర్ :
కంది సూర్యనారాయణ
సెల్ : 9848052327


## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా
# తీర్చిదిద్దడమే లక్ష్యం

**సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. **LBS**, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు. **MIT,** అమెరికాలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదమయ్యాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## రాంచందర్ రావు అరెస్ట్ కాంగ్రెస్
# అరాచకానికి నిదర్శనం

**నితిన్ నబీన్**

**పరామర్శకు వెళుతున్న రాంచందర్ రావును అరెస్ట్ చేయడం హేయమన్న నితిన్ నబీన్**

**రాజ్యాంగం గురించి రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ నాటకాలేనని విమర్శ**

**కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని వ్యాఖ్య**



తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. ఈ అణచివేత చర్య కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాకోరుతనానికి, నియంతృత్వ - మిగతా3లో

## ఆరోగ్యశాఖలో మరో
# భారీ రిక్రూట్‌మెంట్..

**1,931 పోస్టులకు ప్రావిజనల్ మెరిట్ లిస్ట్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** తెలంగాణ ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించిన ప్రావిజనల్ మెరిట్ లిస్ట్‌ను అధికారులు విడుదల చేశారు. అభ్యర్థులను 1:1.25 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేశారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు సెప్టెంబర్ 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ వెంగల్‌రావునగర్‌లోని **IIFHW**లో ఈ ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. నిర్ణీత తేదీల్లో వెరిఫికేషన్‌కు హాజరు కాలేని అభ్యర్థులకు సెప్టెంబర్ 28వ తేదీన మరో అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకురావాల్సి ఉంటుంది. విద్యార్హతలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించనున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఫైనల్ మెరిట్ లిస్ట్‌తో పాటు సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేయనున్నారు. గత రెండున్నరేళ్లలో తెలంగాణ ఆరోగ్యశాఖలో 15 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం మరో 2 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా కొనసాగుతోంది. 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రావిజనల్ మెరిట్ లిస్ట్‌లో చోటు దక్కిన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలు, అవసరమైన ధ్రువపత్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు

**కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు.. తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట**

**కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు**

**తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు**

**సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం**

**ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు**



తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, - మిగతా3లో

# ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అంటూ బడాయి కొట్టే రేవంత్ రెడ్డి..

**నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటు**

**మాజీ మంత్రి బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**



**హైదరాబాద్:**గత రెండున్నరేళ్లుగా ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.అధ్యాపకులు, నాన్టీచింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందక నరకం చూస్తున్నారు. అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, ఇతర నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మీ తీరు వల్ల ఒకప్పుడు రాష్ట్రంలో సుమారు 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య ఇప్పుడు దాదాపు 650కి పడిపోయింది. అంటే ఇప్పటికే సుమారు 310 కళాశాలలు తగ్గిపోయాయి. ఇదే పరిస్థితి - మిగతా3లో


# మూడేళ్లైనా పదవులు ఊసేది



**హైదరాబాద్ సెప్టెంబర్ 1:**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా, ప్రభుత్వంలో భాగస్వామ్యం కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ద్వితీయ శ్రేణి నేతలు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఆశించిన ఫలితం దక్కడం లేదు. కార్పొరేషన్ ఛైర్మన్లు, మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ సంస్థలు, దేవాలయ ట్రస్ట్ బోర్డులు, డీసీసీబీలు, పీఏసీఎస్ వంటి వందలాది నామినేటెడ్ పోస్టులు నేటికీ అరకొరగానే భర్తీ కావడం లేదా పెండింగ్‌లోనే పడి ఉండటం గులాబీ శ్రేణులను ఓడించి హస్తం జెండాను ఎగురవేసిన కేడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. అంతర్గత విభేదాలకు తోడు సొంత కేడర్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల కాంగ్రెస్‌లో నిరసన జ్వాలలు క్రమంగా రగులుతున్నాయి.గాంధీభవన్‌లో ఇన్‌ఛార్జ్ మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో తరచుగా సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి - మిగతా3లో

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు
# హైకోర్టులో ఊరట

**సింగిల్ బెంచ్ ఆదేశాలపై డివిజన్ బెంచ్ స్టే..**
**నవంబర్ 3కు తదుపరి విచారణ**




**హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి మార్చాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్.. తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది.సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన అప్పీల్‌ను పరిశీలించిన డివిజన్ బెంచ్.. ఆ ఆదేశాల అమలును తదుపరి విచారణ వరకు నిలిపివేసింది. దీంతో అప్పటి వరకు హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగేందుకు మార్గం సుగమమైంది.ఇదిలా ఉండగా, లోత్కుంట భూములకు సంబంధించిన వ్యవహారంలోనూ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు లోత్కుంట భూముల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హైడ్రాను ఆదేశించింది.నవంబర్ 3న ఈ వ్యవహారంపై తదుపరి విచారణ జరగనుంది. అప్పటి వరకు రంగనాథ్‌ను కమిషనర్ పదవి నుంచి మార్చాలన్న సింగిల్ బెంచ్ ఆదేశాలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లైంది.

## ‘శుద్ధీకరణ’ పేరుతో
# సామాజీక అవమానం...

**ప్రశ్నిస్తే ఎఫ్ఐఆర్‌లతో రాజకీయ ప్రతీకారం**

**ఖర్గే నిలిచిన వేదికను ‘శుద్ధి’ చేయడం దళిత ఆత్మగౌరవంపై దాడి**


**అంటరానితనాన్ని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులా?.. ఇదెక్కడి న్యాయం?:**

**ఎన్ని ఎఫ్ఐఆర్‌లు పెట్టినా సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పోరాటాన్ని ఆపలేరు**

**మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్:**దేశ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్నది కేవలం కాంగ్రెస్--బీజేపీల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వానికి సామాజిక వివక్షకు మధ్య, ప్రజాస్వామ్య ప్రశ్నకు అధికార దమనానికి మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంఘర్షణ అని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికపై అనంతరం నిర్వహించిన ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోని అత్యున్నత దళిత నాయకుల్లో ఒకరైన ఖర్గే ప్రసంగించిన వేదికను ఆ తర్వాత ‘శుద్ధి’ చేయాల్సిన ప్రదేశంగా చిత్రీకరించడం ఒక వ్యక్తికి జరిగిన అవమానం మాత్రమే కాదని, తరతరాలుగా వివక్ష, సామాజిక వెలివేత, అవమానాలను ఎదుర్కొన్న కోట్లాది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.“మనిషిని మనిషిగా చూడాలని రాజ్యాంగం చెబుతోందని,కానీ మనిషి నిలిచిన నేలను కూడా ‘శుద్ధి’ చేయాలనే - మిగతా3లో



## తుమ్మిడిహట్టిపై తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారుల
# సుదీర్ఘ భేటీ..

**న్యూఢిల్లీ:** తుమ్మిడిహట్టి బ్యారేజీపై ఢిల్లీలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారుల మధ్య సమావేశం ముగిసింది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా బ్యారేజీ ఎత్తు, సాంకేతిక అంశాలు, అంతర్రాష్ట్ర సమస్యలపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమీక్షించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తును గతంలో మహారాష్ట్ర అంగీకరించిన 148 మీటర్లకు బదులుగా 152 మీటర్లకు పెంచేలా ఆ రాష్ట్రాన్ని ఒప్పించేందుకు తెలంగాణ అధికారులు తమ ప్రతిపాదనలను - మిగతా3లో

# సంపాదకీయం

## ఒకే ప్రపంచం ఒకే మానవత్వం

అమెరికా పర్యటనలో ఉన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యూయార్క్‌లో జరిగిన మల్టీ-ఫెయిత్ డైలాగ్‌లో హిందూ--ముస్లిం సంబంధాలు, హిందుత్వ భావనపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. భారత్‌లో ముస్లింలు ఉండకూడదని ఏ హిందువు భావించినా.. అతను హిందువుగా మిగలడంటూ పేర్కొన్నారు.. అమెరికాలోని న్యూయార్క్‌లో గల ప్రతిష్టాత్మక మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో 'అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్' ఆధ్వర్యంలో ఆగస్టు 29న విశ్వ ఏకత్వ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ కీలక ప్రసంగం చేశారు.నం అమెరికా గురించి మాట్లాడేటప్పుడు 'బహుళత్వం అనే పదాన్ని ఎక్కువగా వింటాం. కానీ, భారత్ గురించి చర్చించేటప్పుడు 'భిన్నత్వంలో ఏకత్వం' అనే పదం గుర్తుకువస్తుంది. భారత్‌ను ఒక భౌగోళిక ప్రాంతంగా మాత్రమే చూడలేం. ఈ భిన్నత్వం, ఐక్యత రెండూ భారతీయ డిఎన్ఏలోనే భాగమయ్యాయి. ఈ విశ్వంలో ప్రతి దేశానికి ఒక ప్రత్యేకమైన లక్ష్యముంటుంది" అని పేర్కొన్నారు.స్వామి వివేకానంద మాటలను గుర్తుచేస్తూ.. జగత్తుకు ఐక్యతా సందేశాన్ని అందించడం, ఆ సూత్రాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే భారత్ అసలు లక్ష్యమని ఆయన అన్నారు. "మనమంతా ఒక్కటే. వైవిధ్యం అనేది మన ఏకత్వానికి ఒక అలంకారం వంటిది. అందుకే వైవిధ్యాన్ని గౌరవించాలి, అంగీకరించాలి, జరుపుకోవాలి" అని పిలుపునిచ్చారు.రాక్షస ప్రవృత్తిమా మాట వింటేనే రక్షణ కల్పిస్తాం" అని షరతులు విధించే ధోరణి. సంస్కృతంలో రక్షణను 'రక్ష' అంటారు. తమను లొంగదీసుకునే వారిని మాత్రమే రక్షించేవారు రాక్షసులు.ధర్మం అభిప్రాయాలు, ఉపయోగాలతో సంబంధం లేకుండా అందరినీ మానవులుగా చూస్తూ, సోదరభావంతో మెలగడమే నిజమైన మానవత్వం.అంతర్గతంగా ఉన్న ఏకత్వ భావనే ధర్మమని, అది అందరినీ ఏకం చేస్తుందే తప్ప విడదీయదని మోహన్ భగవత్ అన్నారు.ప్రకృతి మరియు సమాజం పట్ల మన బాధ్యతలను గుర్తుచేస్తూ.. "మనం తినే ఆహారం రైతుల శ్రమ వల్ల, వేసుకునే బట్టలు కార్మికుల కష్టం వల్ల వస్తున్నాయి. సమాజంలో ప్రతి ఒక్కరికీ మనం రుణపడి ఉన్నాం. అందుకే తిరిగి సమాజానికి సేవ చేయడం మన బాధ్యత" అని చెప్పారు. ప్రపంచంలో స్థిరపడిన భారతీయులు తమ కర్మభూమి పట్ల విధేయతతో ఉంటూనే, జన్మభూమి విలువలను పాటించాలని ఆకాంక్షించారు.మోహన్ భాగవత్ ప్రసంగానికి ముందు, ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుండి విచ్చేసిన 180 మంది మత నాయకులు ఒక ప్రతిజ్ఞను స్వీకరించారు. 'వన్ వరల్డ్ -- వన్ హ్యూమానిటీ' (ఒకే ప్రపంచం -- ఒకే మానవత్వం) పేరిట 5 సూత్రాల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. మతం పేరుతో ద్వేషం, హింసను ప్రేరేపించడాన్ని ప్రపంచ మత నాయకులు ముక్తకంఠంతో ఖండించారు. అంతర్జాతీయ సదస్సులో 39 రాష్ట్రాలు, 850 అమెరికన్ నగరాలు, 29 దేశాలకు చెందిన దాదాపు 6,000 మంది ప్రతినిధులు, 250 ఆధ్యాత్మిక-సామాజిక సంస్థలు భాగస్వామ్యమయ్యాయి.భాగవత్ అన్నారుకొంతమంది ముస్లింలు నాతో మాట్లాడుతూ ఆరెస్సెస్ అంటున్న హిందూ దేశం అంటే ఏంటి? ముస్లింలను దేశం నుంచి తరిమేయడమేనా అని అడిగారు. దానికి నేను 'అలా చేయడం హిందూత్వ కాదు. భారత్‌లో ముస్లింలు ఉండకూడదని ఎవరైనా హిందువు భావిస్తే అతను హిందువు కాదని చెప్పాను" అని ఆయన వివరించారు."మనం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అని చెప్పినప్పుడు అందరికీ బహుళత్వం గుర్తుకొస్తుంది. అలాగే భారత్ అని చెప్పినప్పుడు భిన్నత్వంలో ఏకత్వం గుర్తుకొస్తుంది" అని భాగవత్ తన ప్రసంగంలో చెప్పారు.అన్ని మతాలు అంతిమంగా దైవాన్వేషణకే దారితీస్తాయని హిందూ సంప్రదాయం చెబుతోందని భాగవత్ అన్నారు. ఇతరచోట్ల రక్షణ లభించని వివిధ మతాల ప్రజలకు భారతదేశం ఎప్పటి నుంచో ఆశ్రయం కల్పిస్తోందని ఆయన చెప్పారు.అయితే, వర్గాల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడటంలో గతం'వారసత్వం' పాత్ర పోషించిందని ఆయన అన్నారు.భిన్నత్వం ఉన్నప్పటికీ అందరిలో ఒక మౌలికమైన ఐక్యత ఉందనే భావనను సమాజానికి తెలియజేయడం ఆర్ఎస్ఎస్ బాధ్యత అని ఆయన అన్నారు."మనం విధానాలను ప్రభావితం చేయాలనుకుంటున్నాం. యుద్ధాలను ఆపాలనుకుంటున్నాం. అందుకే మనం రాజకీయాలను ప్రభావితం చేయాలనుకుంటున్నాం. కానీ మనం రాజకీయాలు చేయలేం. రాజకీయాలు స్వార్థపు ఆటగా మారాయి. 'నేను నాది' ఉన్నచోట పరిష్కారం లేదు. 'మనం మనది' అనుకుంటేనే పరిష్కారం సాధ్యం" అని భాగవత్ చెప్పారు.హరియాణా గగనతలంపై 1996లో సౌదీ ఎయిర్‌లైన్స్ విమానం, కజకిస్తాన్ ఎయిర్‌లైన్స్ విమానం ఢీకొన్న ఘటనను భాగవత్ గుర్తుచేసుకున్నారు. ఆ ప్రమాద స్థలానికి మొదటగా చేరుకున్న వారిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కూడా ఉన్నారని, గాయపడిన వారికి వారు సాయం చేశారని చెప్పారు."అతను ముస్లిం అని మేం అనుకోలేదు. మేం రాజకీయాల్లో ఉండిఉంటే, బహుశా ఇది చేయలేకపోయేవాళ్లం" అని ఆయన అన్నారు."తప్పుడు కథనాల వల్ల అపోహలు ఏర్పడతాయి. కానీ మీరు మా మధ్యకు వచ్చి మమ్మల్ని దగ్గరగా చూస్తే, ఈ అపోహలన్నీ ఒక్క రోజులోనే తొలగిపోతాయి" అని భాగవత్ చెప్పారు.ఈ సమావేశానికి నైజీరియాలోని ప్రముఖ క్యాథలిక్ మతగురువు 1994 నుండి 2019 వరకు అబుజా ఆర్చ్‌బిషప్‌గా పనిచేసిన కార్డినల్ జాన్ ఒలోరున్‌ఫెమి ఒనైయెకాన్ కూడా హాజరయ్యారు.గతపు 'వారసత్వం' గురించి ప్రస్తావించిన ఒనైయెకాన్, ఆఫ్రికాలో మతపరమైన సంఘర్షణలకు గల కారణాలలో ఒకటి మతమార్పిడి, ఆధిపత్యం కోసం ఇస్లాం - క్రైస్తవ మతాల మధ్య జరిగిన చారిత్రక పోటీ అని అన్నారు.మనం గత వారసత్వాన్ని మోస్తున్నాము. దానిని వదిలేయాలి" అని ఆయన చెప్పారు.ఆఫ్రికాలో రెండు మతాలు విస్తరిస్తున్నప్పుడు తన కుటుంబంలో కొందరు క్రైస్తవులుగా మరికొందరు ముస్లింలుగా మారారని ఆయన గుర్తు చేశారు."మతమార్పిడి, ఆధిపత్యం కోసం ఇస్లాం, క్రైస్తవ మతాలు ఆఫ్రికాలోకి పోటీగా వచ్చాయి. ఆ వైరం ఇంకా ముగియలేదు" ఒనైయెకాన్ అన్నారు.

# హిజ్రాలు దందా మాములుగా లేదుగా...

**రంగారెడ్డి, సెప్టెంబర్ 1:**గతంలో రైళ్లలో మాత్రమే హిజ్రాలు కనిపించేవారు. ప్రయాణికులనుంచి డబ్బులు వసూలు చేసేవారు. డబ్బులు ఇవ్వకపోతే వీరంగం సృష్టించేవారు. హిజ్రాల తాకిడి పెరిగిపోవడంతో రైల్వే శాఖ అధికారులకు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు.. రైల్వే శాఖ ఎంతగా కట్టడి చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.రైళ్లను దాటి ఇప్పుడు హిజ్రాలు ఏకంగా గ్రామాల మీద పడుతున్నారు. పెళ్లిళ్లు లేదా ఏదైనా వేడుకలు చేసుకుంటే అక్కడికి వచ్చి వీరంగం సృష్టిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. అంతేకాదు ఇంకా రాయడానికి వీలైన దుర్మార్గమైన చేష్టలకు పాల్పడుతున్నారు. హిజ్రాల వ్యవహార శైలి వల్ల ఇబ్బంది పడ్డవారు పోలీసులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఆ హిజ్రాలను గుర్తించి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు. ఆయనప్పటికీ హిజ్రాల వ్యవహార శైలి మారిపోవడం లేదు. పైగా ఆశీర్వాదం పేరుతో హిజ్రాలు శుభకార్యాలు జరిగే చోటుకు వస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే వీరంగం సృష్టిస్తున్నారు.తాజాగా తెలంగాణ రాష్ట్రంలో ఓ ప్రాంతంలో ఓ కుటుంబానికి చెందినవారు వివాహం నిర్వహిస్తున్నారు. ఆ వేడుకను అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. వేడుక జరిగే ఫంక్షన్ హాల్ వద్దకు హిజ్రాలు వచ్చారు. డబ్బులు డిమాండ్ చేశారు.ఏకంగా 50,000 ఇవ్వాలని కోరారు. దానికి ఆ వివాహం జరిగే కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. పైగా ఫంక్షన్ హాల్ తలుపు వద్ద కూర్చున్నారు. చివరికి 20000 ఇస్తామని చెబితే హిజ్రాలు ఊరుకోలేదు.బూతులతో రెచ్చిపోయారు. అంతేకాదు మరో 10 మందిని పిలిపించుకొని హంగామా సృష్టించారు. చివరికి 35000 తీసుకొని వెళ్ళిపోయారు. ఈ విషయాన్ని హైదరాబాద్ నగరానికి చెందిన ఒక వ్యక్తి సోషల్ మీడియా వేదికగా బయటపెట్టాడు."హిజ్రాల దూకుడుకు అడ్డుకట్ట వేసే మార్గం లేదా. తెలంగాణ పోలీసులు వారిని ఏమీ చేయలేరా. ఈ స్థాయిలో ధర్నానికి పాల్పడుతుంటే ఏం చేయాలి.. శుభకార్యాలు జరిపే ఇండ్ల మీద పడుతున్నారు. బూతులతో రెచ్చిపోతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే దాడులు చేసేందుకు కూడా వెనుకాడటం లేదు. ఇటువంటివారిని ఎలా అడ్డుకోవాలి.. ఎలాంటి చర్యలు చేపడితే ఎటువంటి వారు ఇండ్ల మీదికి రారు.. పోలీసులు ఏమైనా పరిష్కార మార్గం చూపిస్తారా.. ఇటువంటివారు వస్తారేమోనని భయంతో పెళ్లి వేడుకలు కూడా జరుపుకోవడం కష్టంగా ఉందని" ఆ వ్యక్తి వాపోయాడు. మరి హిజ్రాల దూకుడు ఎలా అడ్డుకట్ట వెయ్యాలో తెలంగాణ పోలీసులే ఒక నిర్ణయం తీసుకోవాలని సోషల్ మీడియాలో విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.



# ఒకే ఒక్కడు స్టైల్ లో విజయ్

**చెన్నై, సెప్టెంబర్ 1:**తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విజయ్ అనుసరిస్తున్న తీరు సాంప్రదాయ రాజకీయాలకు పూర్తి భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి పీఠాన్ని అధికారాన్ని చెలాయించే వేదికగా కాకుండా, ప్రజలు ఇచ్చిన బాధ్యతగా భావిస్తూ ఆయన అడుగులు వేస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో సెంట్రల్ జైలులో తనిఖీలు చేయడం, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యార్థుల హాస్టళ్లకు అకస్మాత్తుగా వెళ్లి నిరాడంబరంగా సామాన్యులలో ఒకడిగా కలిసిపోవడం వంటి చర్యలు నాటి ఒకే ఒక్కడు సినిమా ఘట్టాలను తలపిస్తున్నాయి.ఈ వైఖరి వెనుక అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. తాను ఒక వీఐపీనో లేదా పాలకుడినో అని అనుకోకుండా, ప్రజల మధ్య ఉండే సిటిజన్ విజయ్ అనే ముద్రను బలంగా తీసుకెళ్లడం. అధికారుల ఆర్భాటాలు లేకుండా, స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయడం ద్వారా వికేంద్రీకృత వ్యవస్థల్లో లోపాలను నేరుగా ఎత్తిచూపుతున్నారు. చెన్నై కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవడం, లంచాల నిరోధానికి వాట్సాప్ విజిలెన్స్ నంబర్లను ప్రారంభించడం వంటి సంస్కరణలు ప్రజాదరణను మరింత పెంచాయి.అయితే, ఈ సర్‌ప్రైజ్ విజిట్ నమూనా సుదీర్ఘ రాజకీయాల్లో ఎంతకాలం నిలబడుతుందనేదే అసలైన ప్రశ్న. రాజకీయ విశ్లేషకుల ప్రకారం, ఒక సీఎంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం అనేది పరిపాలనలో తాత్కాలిక భయాన్ని, అధికారుల్లో తక్షణ స్పందనను తెస్తుందే తప్ప, శాశ్వతమైన పాలనా సంస్కరణలకు సరిపోదు. సచివాలయ వేదికగా



విధాన నిర్ణయాలు , రాష్ట్ర ఆర్థిక లోటును అధిగమించడం, సుదీర్ఘకాల నిరుద్యోగ నివారణ చర్యలు చేపట్టడం పైనే ప్రభుత్వం సాధించే అసలైన విజయం ఆధారపడి ఉంటుంది.ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రారంభంలో లభించే ఈ మాస్ క్రేజ్, ప్రజల్లోకి చొచ్చుకుపోయే శైలి విజయ్ రాజకీయ ప్రయాణానికి బలమైన ఆరంభాన్ని ఇచ్చాయి. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ ఈ వన్ మ్యాన్ ఆర్మీ షో నుంచి క్రమబద్ధమైన పాలనా వ్యవస్థను నిర్మించగలిగితేనే.. ప్రజలు ఆయనపై ఉంచిన నమ్మకం నిలబడుతుంది. సినిమా స్టైల్ ఆకర్షణలను దాటి, దీర్ఘకాలిక ఫలితాలను సాధించడమే ప్రస్తుతం విజయ్ ముందున్న అసలైన సవాలు.

# కొత్త ఫీచర్లతో ఉగ్రవాదులు...

**శ్రీనగర్, సెప్టెంబర్ 1:**వాట్సప్ ఉపయోగిస్తే దొరికిపోతున్నారు. ఫేస్బుక్ వాడితే తప్పించుకోలేకపోతున్నారు. ఇన్స్టాగ్రామ్ ఉపయోగిస్తే సరెండర్ అవుతున్నారు. కొద్దిరోజులుగా సరిహద్దుల్లో భారత భద్రత దళాలు ముప్పేట దాడి చేస్తున్న నేపథ్యంలో ఉగ్రవాదులకు ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది.ఇలాగైతే తమ కార్యకలాపాలు ఆగిపోతాయని.. సరిహద్దుల్లో రక్తపాతం నిలిచిపోతుందని.. తమ ఉనికికే ప్రశ్నార్ధకం ఏర్పడుతుందని ఉగ్రవాదులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఉగ్రవాదులకు అండగా నిలవడానికి పాకిస్తాన్ సరికొత్త ఎత్తులకు పాల్పడుతోంది. భారత భద్రత దళాలు కూడా ఊహించని విధంగా సరికొత్త పన్నాగానికి తెర లేపింది. జాతీయ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం భారత సంస్థల నిఘా నుంచి తప్పించుకోవడానికి ఉగ్రవాదులు సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా టెర్రరిస్టులు.. వారి హేండర్లు అత్యంత సీక్రెట్ గా సంభాషించుకుంటున్నారు. సూచనలు.. ఆదేశాలు చేరడానికి దారుణమైన వెబ్సైట్లు.. ప్రత్యేకమైన ఎన్క్రిప్టెడ్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్నారు.ఉగ్రవాదుల కార్యకలాపాలను తెలుసుకోవడానికి కొంతకాలంగా ఇండియన్ ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ సోషల్ మీడియా వేదికల మీద దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదుల నియామకాల కోసం టెర్రరిస్ట్ గ్రూపులు..పాకిస్తాన్ దేశానికి చెందిన ఐఎస్ఐ.. రహస్య మార్గాల ద్వారా తమ ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. లైవ్ చాట్ ఫీచర్లతో కూడిన దారుణమైన వెబ్సైట్లు.. యూజర్ల గుర్తింపుర



దాచిపెట్టే మెసేజ్ అప్లికేషన్లను ఉగ్రవాదులు వాడుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై పాకిస్తాన్ ఉగ్రవాదులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్టు కూడా సమాచారం. ఉగ్రవాదుల మధ్య కమ్యూనికేషన్ కోసం గతంలో వాట్సాప్, ఫేస్బుక్, మెసెంజర్, సిగ్నల్ వంటి సోషల్ మీడియా యాప్స్ ఉపయోగించేవారు. అయితే దీని మీద ఇండియన్ పోలీస్ డిపార్ట్మెంట్ గట్టిగా ఫోకస్ చేయడంతో ఉగ్రవాదులకు ఊపిరి సలపని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్.. వియత్నాం ఆధారిత అప్లికేషన్లు.. చైనా మూలాలు ఉన్న అప్లికేషన్లను ఉగ్రవాదులు వాడుతున్నట్టు తెలుస్తోంది. అయితే వీటి పని పట్టేందుకు ఇండియన్ పోలీస్ డిపార్ట్మెంట్ రంగంలోకి దిగింది.కొంతకాలంగా ఉగ్రవాదులు సోషల్ మీడియా యాప్స్ ఉపయోగించడం లేదు కేవలం వారు రహస్య మార్గాలలో సంకేతాలు ఇచ్చుకుంటున్నారు. రకరకాల రూపాలలో సంభాషణలు సాగిస్తున్నారు. దీని వెనుక ఏదో కుట్ర దాగి ఉందని అర్థమవుతుంది. అయితే వారు తమ సంభాషణలు జరుపుకోవడానికి ఎటువంటి విధానాలు ఉపయోగిస్తున్నారో లోతుగా తవ్వితే వారు ఎన్క్రిప్టెడ్ అప్లికేషన్లు, ఇంకా దారుణమైన వెబ్సైట్లు వాడుతున్నట్టు తెలుస్తోంది. ఇందులో లైవ్ చాట్ చేసుకునే అవకాశం ఉండడంతో ఉగ్రవాదులు ఈ దారుణాలకు పాల్పడుతున్నట్టు తెలియ వచ్చింది. దీనిపై భారత భద్రత దళాలు లోతుగా దర్యాప్తు చేస్తున్నాయని" జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

# ప్రైవేట్ రంగంలోకి డిఫెన్స్....

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:**మనదేశంలో ప్రైవేట్ వ్యవస్థ అన్ని రంగాలకు విస్తరించింది. ఇంతవరకు ప్రైవేట్ రంగం తొంగి చూడని కొన్ని రంగాలు ఉన్నాయి. అందులో డిఫెన్స్ రంగం ముందువరుసలో ఉంటుంది. అయితే ఇప్పుడు ఇందులో కూడా ప్రైవేట్ ప్లేయర్స్ వచ్చేసారు.ఇండియన్ డిఫెన్స్ టెక్నాలజీని పూర్తిగా మార్చేయడానికి భారత ప్రభుత్వం ప్రవేట్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నది. దీని మీద కొంతమంది విమర్శలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. పైగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆత్మ నిర్భర్ భారత్ అంటూ సరికొత్త పథకాన్ని తీసుకొచ్చి.. దేశాన్ని విదేశీ దిగుమతుల మీద ఆధారపడడాన్ని తగ్గించారు. ప్రైవేట్ కంపెనీలకు డిఫెన్స్ రంగంలో అవకాశం కల్పించడం అనేక కారణాలు ఉన్నాయి. ప్రైవేట్ కంపెనీల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. డ్రోన్ టెక్నాలజీ వ్యవస్థ ఉంది. వాటిని ఇండియన్ డిఫెన్స్ రంగంలో వాడబోతున్నారు.. ప్రభుత్వ రంగ సంస్థలతో పోల్చి చూస్తే ప్రైవేట్ కంపెనీలు అత్యంత వేగంగా ఉత్పత్తులను తయారుచేస్తూ ఉంటాయి. అందువల్లే ఆ కంపెనీలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచింది. ఇక దేశీయంగా చూసుకుంటే రక్షణ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దేశంలో డిఫెన్స్ పరికరాలు తయారు చేయడం వల్ల రవాణా ఖర్చులు పూర్తిగా తగ్గుతాయి. విదేశీ కరెన్సీ భారం తగ్గుముఖం పడుతుంది. ప్రైవేట్ కంపెనీల వల్ల భారతదేశం గ్లోబల్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా మారుతుంది. ఇతర దేశాలకు ఆయుధాలను ఎగుమతి చేసే ఆస్కారం లభిస్తుంది.. ఇక తాజా ఒప్పందల ద్వారా టాటా, రిలయన్స్, ఎల్ అండ్ టి, కళ్యాణి వంటి భారత ప్రైవేట్ కంపెనీలకు ఆర్డర్లు లభించబోతున్నాయి.రిలయన్స్.. టాటా..




ఎల్ అండ్ టి.. కళ్యాణి గ్రూప్ సంస్థలు ఇప్పటికే మిస్సైల్స్.. యుద్ధ విమానాలు.. సబ్ మెరైన్లు తయారు చేస్తున్నాయి.. భారతదేశం రక్షణ సాంకేతికతను ప్రైవేట్ కంపెనీలతో పంచుకోవడం వెనుక ప్రధాన కారణం కూడా ఒకటుంది. సైనిక దళాల ఆధునికీకరణ వేగవంతం చేయడం.. దేశీయ రక్షణ ఉత్పత్తిని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడం.. ప్రభుత్వ పరిశోధన సంస్థ అయిన డిఆర్డిఓ డెవలప్ చేసిన టెక్నాలజీని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తూ ఉంటుంది. దీనివల్ల వేగవంతమైన భారీ ఉత్పత్తి చోటు చేసుకుంటుంది. ప్రైవేట్ కంపెనీల వద్ద ఉన్న అత్యాధునిక ప్లాంట్లు.. మౌలిక సదుపాయాల ద్వారా ఆయుధాలను వేగంగా తయారు చేయవచ్చు. భారీగా ఉత్పత్తి చేయవచ్చు.. ప్రయోగశాలకే పరిమితమైన సాంకేతికతను ప్రైవేట్ రంగానికి ఇస్తే అవి త్వరగా ఇద్దరంగానికి అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ రంగ సంస్థల మీద భారం తగ్గుతుంది.. హెచ్ ఏ ఎల్, బి ఈ ఎల్ వంటి ప్రభుత్వ రక్షణ సంస్థలపై ఉన్న అదనపు పని భారం తగ్గుతుంది. ప్రైవేట్ కంపెనీలను భాగస్వాములను చేస్తే ఉత్పత్తి మరింత పెరుగుతుంది. ప్రైవేట్ రంగంలో పోటీ ఉండడంవల్ల రక్షణ పరికరాల తయారీ ఖర్చు పూర్తిగా తగ్గుతుంది. రాడార్లు.. కమ్యూనికేషన్ సిస్టం వంటి వాటి తయారీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది.. అంతర్జాతీయ రక్షణ మార్కెట్లో భారతీయ ప్రైవేట్ కంపెనీలో భాగస్వాములు కావడానికి సాంకేతికత తోడ్పడుతూ ఉంటుంది. ఇప్పటికే డిఫెన్స్ పరికరాల తయారీ విషయంలో అమెరికా దూకుడుగా ముందుకు వెళ్తోంది. చైనా కూడా ఆదే స్థాయిలో ఉంది. ఇజ్రాయిల్.. ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ముందు వరుసలో ఉన్నాయి. వీటన్నిటికి చెక్ పెట్టి అగ్రస్థానంలో ఉండాలి అంటే భారత్ కచ్చితంగా ఈ మార్పులకు శ్రీకారం చుట్టాల్సిందే.

# కేంద్ర నిధులు ఖర్చు చేయలేని స్థితిలో ఎంపీలు...



**హైదరాబాద్ సెప్టెంబర్ 1:** ప్రజలు ఓటు వేసి గెలిపించారు. బ్రహ్మాండమైన మెజారిటీ అందించారు. మా కోసం పని చేయండి అని విన్నవించారు. కానీ గెలిచిన ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారు.. ప్రజలు పరోక్షంగా చెప్పిన మాటలను పక్కనపెట్టి.. తమకు కావలసిన పనులు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 23 మంది పార్లమెంట్, రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. వీరికి గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఎంపీ లాడ్స్ కింద 394.8 కోట్లు నిధులు లభించాయి. వీటిని వివిధ పనుల కోసం ఉపయోగించాల్సిన ఎంపీలు.. వాటిని పక్కన పెట్టారు. ప్రజల కోసం పనికి వచ్చే పనులకు వారు ఖర్చు చేయలేకపోయారు. ఈ విషయం ఏం పవర్డ్ ఇండియన్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో బయటికి వచ్చింది. జాతీయ సగటు నిధుల వినియోగం ఏకంగా 33 శాతం ఉంటే తెలంగాణ రాష్ట్రంలో అతి కేవలం 23 శాతం మాత్రమే ఉంది. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ ఎంపీలలో కిషన్ రెడ్డి 3.23% నిధులు వినియోగించారు. బండి సంజయ్ 38%.. అరవింద్ 56%.. బలరాం నాయక్ 49 శాతం.. వద్దిరాజు 45%, రాజేందర్ 10.6%, అసదుద్దీన్ 7.6%, రేణుక చౌదరి 2.8%, పార్థసారథి 2.43% నిధులు మాత్రమే ఖర్చు చేశారు. ఆరుగురు ఎంపీలు కేవలం పది శాతం లోపు మాత్రమే నిధులు ఖర్చు చేయడం విశేషం. చాలామంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు జరగడం లేదు. కొన్ని ప్రాంతాలు అయితే సరిగా రోడ్లు కూడా లేవు. వర్షాలు వస్తే రోడ్లమీద మురికినీరు ప్రవహిస్తూ ఉంటుంది.. ఎంపీ నిధులతో రోడ్లు నిర్మించవచ్చు. డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయవచ్చు. పారిశుధ్యం మెరుగుపరచవచ్చు. ఇంకా అనేక రకాల పనులు చేయవచ్చు. కానీ ఇవేవీ చేయడం లేదు. ఎంపీలు నిధులను ఖర్చు చేయడం లేదు. దీంతో అభివృద్ధి అనేది ఆగిపోతుంది. ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో ఎన్నడూ కూడా ఎంపీల నిధులలో కోత విధించలేదు. ఇప్పుడు దండిగా నిధులు విడుదల చేస్తోంది. అయినప్పటికీ ఎంపీలు వాటిని ఖర్చు చేయడంలో విఫలమవుతున్నారు. వాస్తవానికి ఈ నిధులతో ఇంకా అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి ఆస్కారం ఉంటుంది . కానీ మన ఎంపీలు ఆ విషయాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. వచ్చిన నిధులను ఖర్చు చేయకుండా చోద్యం చూస్తున్నారు

## రాష్ట్రంలో అప్రకటిత కర్ఫ్యూ అమలు చేస్తున్నారు

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



**హైదరాబాద్:** రేవంత్ రెడ్డి అక్రమ ఆదేశాలు అమలు చేయడంలో కూడా డీజీపీ సెంచరీ కొట్టేలాగా ఉన్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. లేకపోతే మిర్యాలగూడలో కేటీఆర్ హాజరవుతున్న రైతు సదస్సు కోసం మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు అప్లై చేస్తే డీఎస్పీ పర్మిషన్ రిజెక్ట్ చేశారు. గత నెలలో కూడా బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు కోసం పర్మిషన్ నిరాకరిస్తే హైకోర్టుకి వెళ్లి అనుమతి తెచ్చుకున్నామని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో, పండగల ఊరేగింపు సమయంలో పెట్టాల్సిన సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ పెడుతారు. అలాంటి సెక్షన్ 30 కేటీఆర్ రైతు సదస్సు మీద ఏ బేసిస్ మీద పెడుతారు. ఈ రాష్ట్రంలో డిసెంబర్ 7, 2023 నుండి అప్రకటిత కర్ఫ్యూ అమలు చేస్తున్నారు. మొన్న కూడా హరీశ్ రావు పాలిటెక్నిక్ విద్యార్థులతో మాట్లాడుతాను అంటే హౌస్ అరెస్ట్ చేశారు. మా నాయకులను పెళ్లికి, ఆసుపత్రికి, చివరికి చావుల దగ్గరికి కూడా పోనివ్వడంలేదని అన్నారు.

## కల్వకుంట్ల కవితకు కౌంటర్ ఇచ్చిన వేముల ప్రశాంత్ రెడ్డి

**కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి**

**కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి**

**కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా**



కష్టకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట ఉన్నది ఎవరో కవిత తెలుసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై కవిత చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కవిత చర్యల వల్ల తండ్రి కేసీఆర్ ఎంతటి మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఆలోచించుకోవాలని... తాను ఎప్పుడూ కేసీఆర్–కవితలను కలపడానికే ప్రయత్నించాను తప్ప విడగొట్టడానికి కాదని స్పష్టం చేశారు. తాను, తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి 2001లో పార్టీ ఆవిర్భావానికి ముందే కేసీఆర్ వెంటే ఉన్నామని, తాము టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యులమని గుర్తుచేశారు. "బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్" అని పేర్కొన్న ఆయన... కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పార్టీ లైన్ దాటినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ లోపలా బయటా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరంతరం పోరాడుతున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. తాను కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి మంతనాలు జరపలేదని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ప్రమాణపూర్వకంగా చెప్పగలనని... మరి కాంగ్రెస్‌తో కవిత రహస్య మంతనాలు జరపలేదని ఆమె చెప్పగలరా? అని నిలదీశారు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తులుగా, బలంగా ఉన్న నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తూ... పార్టీని బలహీనపరిచి పరోక్షంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కవిత లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. సభలో ఆమె కన్నీళ్లు పెట్టుకోవడం కేవలం రాజకీయం కోసం, సానుభూతిని పొందేందుకేనని విమర్శించారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీని చేయడంలో తన పాత్ర ఏంటో కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసని, నిన్నటి వరకు ఆమెపై ఉన్న గౌరవాన్ని తన వ్యాఖ్యలతో కవిత స్వయంగా పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## అధికారులు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ నేను లోకల్

**ఖైరతాబాద్:** అధికారులు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ తాను లోకల్ అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల డ్రా కార్యక్రమంలో అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని ఆయన ఆరోపించారు. ఆదర్శ్‌నగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్ వ్యవహరిస్తున్న తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని దానం నాగేందర్ విమర్శించారు. మొదటి విడతలో ఖైరతాబాద్ నియోజకవర్గానికి 480 ఇళ్లు కేటాయించాల్సి ఉండగా.. కేవలం 120 ఇళ్లనే కేటాయించారని, మిగిలిన 360 ఇళ్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. తాను కార్యక్రమానికి రాకముందే డ్రా నిర్వహించి, నియోజకవర్గానికి సంబంధం లేని వారికి ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. ఇదే విధంగా పాతబస్తీ ఎమ్మెల్యేల విషయంలో వ్యవహరిస్తే వారు దాడులు చేసేవారని వ్యాఖ్యానించారు.

# మంత్రి క్యాంపు కార్యాలయంపై దాడి..

**కాంగ్రెస్ నేతల తీవ్ర హెచ్చరికలు ప్రతిదాడి తప్పదు..**

**రెచ్చగొడితే ఊరుకునేది లేదు..**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై తీవ్రస్థాయిలో విమర్శలు: కాంగ్రెస్ నేతలు**





**చీకటి వెలుగునల్లగొండ:** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే కార్యాలయాలు, ఇళ్లపై దాడులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీజేపీలో విలువలు కలిగిన నాయకులు ఎంతోమంది ఉన్నారని, కొందరి తీరుతో ఆ పార్టీకి ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంటికి వచ్చి దాడి చేస్తే తాము చూస్తూ ఊరుకోబోమని, తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు. నల్లగొండలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సంస్కారం, విలువలు మరిచి కొందరు వ్యవహరిస్తున్నారని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం పొందేందుకు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దాడికి ప్రతిదాడి ఎప్పుడైనా ఉంటుందని బీజేపీ శ్రేణులను హెచ్చరించారు. మంత్రి ఇంటిపై దాడి చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి కార్యాలయంలో దాక్కున్నారని ఆరోపించారు. దమ్ముంటే బయటకు రావాలని సవాల్ చేశారు. మంత్రి ఇంటిపై దాడి చేసి ఇష్టానుసారం మాట్లాడితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని అన్నారు. తాము ఎప్పుడూ విలువలకు కట్టుబడి నిరసనలు తెలిపామని, నిరసన తెలిపే హక్కు అందరికీ ఉన్నప్పటికీ దాడులకు పాల్పడటం సరికాదన్నారు. వర్షిత్ రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన తల్లిపై దాడి చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో ప్రచారం పొందేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూడా విలువలు మరిచి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమను ఎవరైనా రెచ్చగొడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. నల్లగొండ మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరెడ్డి పరామర్శల పేరుతో నల్లగొండకు వస్తే పట్టణ పొలిమేర నుంచే అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉన్న నల్లగొండలో రాజకీయ లబ్ధి కోసం ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, వారిని ఎక్కడా తిరగనీయబోమని హెచ్చరించారు.

సమావేశంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కార్పొరేటర్లు బొజ్జ శంకర్, అల్లి సుభాష్ యాదవ్, సమద్, ఇబ్రహీం, ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి, మామిడి కార్తీక్, ఇటికాల శ్రీనివాస్, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ ఏడు రోజుల నిరసన కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వివిధ కార్యక్రమాలు.. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి**





**నల్గొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

**సెప్టెంబర్ 2న మానవహారం**

సెప్టెంబర్ 2న నల్గొండ గడియారం సెంటర్‌లో మానవహారం నిర్వహించడంతో పాటు 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన, బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు.

**3న రైతు సదస్సులు**

సెప్టెంబర్ 3న అన్ని మండల కేంద్రాల్లో రైతు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మిర్యాలగూడలో జరిగే కేటీఆర్ రైతు సదస్సుకు నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

**4న వంటావార్పు**

సెప్టెంబర్ 4న విద్యార్థులు, మహిళలు, దివ్యాంగుల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**5న యువత, విద్యార్థులతో ర్యాలీ**

సెప్టెంబర్ 5న ఎన్జీ కళాశాల నుంచి గడియారం సెంటర్ వరకు యువత, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

**6న ఆటోలతో ర్యాలీ**

సెప్టెంబర్ 6న ఎన్జీ కళాశాల నుంచి నల్గొండ నగర వీధుల మీదుగా ఆటోలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు.

**7న ప్రజావాణిలో వినతిపత్రాలు**

సెప్టెంబర్ 7న నల్గొండ, తిప్పర్తి, కనగల్, మాడుగులపల్లి ప్రాంతాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాల్లో ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

**8న అంబేద్కర్ విగ్రహానికి 420 హామీల వినతిపత్రం**

సెప్టెంబర్ 8న మర్రిగూడ బైపాస్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి 420 హామీలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు భూపాల్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: బండా నరేందర్‌రెడ్డి**

మాజీ నల్గొండ జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ చేపడుతున్న అన్ని నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు కాంగ్రెస్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: కటికం సత్తయ్యగౌడ్**

రాష్ట్ర కల్లుగీత కార్మిక అభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షుడు కటికం సత్తయ్యగౌడ్ మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమాలు రాజకీయాల కోసం కాదని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ప్రజల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, బక్క పిచ్చయ్య, మాజీ నల్గొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీలు కరీంపాషా, నారబోయిన బిక్షం, మాజీ జడ్పీటీసీ తుమ్మల లింగస్వామి, నగర పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకటరెడ్డి, అయితగోని యాదయ్య, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్లు మారగోని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల అశోక్, రత్నగిరి శ్రీనివాస్, కుందూరు ప్రవీణ్‌రెడ్డి, దొడ్డి రమేష్, బాణావత్ దీప్లా, గోపగోని స్వాతి, రాజశేఖర్, పల్లె రంజిత్, పిన్నపరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మిర్యాల యాదగిరి, తవిటి కృష్ణ, పెరిక కరుణ్, జయరాజ్, బడుపుల శంకర్, కందుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ అమలు చేయాలి

**తెలంగాణ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంయుక్త కార్యాచరణ సమితి**





**చీకటి వెలుగు నల్లగొండ:** సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంయుక్త కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని 'సీపీఎస్ రద్దు--ఓపీఎస్ అమలు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ నాగిళ్ల మురళి మాట్లాడుతూ సీపీఎస్ విధానం ఉద్యోగుల పదవీ విరమణ అనంతర పెన్షన్ భద్రతకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ హక్కు సాధించే వరకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ పదవీ విరమణ అనంతర జీవితానికి భరోసా కల్పించే పెన్షన్ ప్రతి ఉద్యోగి హక్కు అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టప్రా రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, టీఎన్జీవోస్ కార్యదర్శి జే.శేఖరెడ్డి, సైదులు, కె.రాంబాబు, యాకుబ్ నాయక్, వెంకట్‌రామ్‌రెడ్డి, వాసుదేవరావు, చేపూరి నర్సింహాచారి, డీఐ రాజు, ఆకనూరి లక్ష్మయ్య, టి.సైదులు, కె.మనోజ్ ప్రదీప్, రణదేవే భాస్కర్, కాశిం, అజీముద్దీన్, ధారావత్ సైదులు, గోవర్ధన్‌రెడ్డి, బైరబోయిన భిక్షం, అనుగుల భిక్షమయ్య, ఉదయ్, సత్యనారాయణ, మహమూద్, రవినాయక్, సునీత, విజయశాంతి, శంకర్‌రెడ్డి, సుమన్ తదితర టీజీఈజేఏసీ నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సీపీఎస్ రద్దు చేయాలి--ఓపీఎస్ అమలు చేయాలి', 'పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం ఆగదు', 'మన పెన్షన్--మన హక్కు' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేసే వరకు ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.

## నల్లగొండలో తీన్మార్ మల్లన్న.. యువతతో ముఖాముఖి





**ప్రజా, యువజన సమస్యలపై చర్చ**

**నల్లగొండ, సెప్టెంబర్ 1:** నల్లగొండ పట్టణంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన »Gen-Z Youth Meetµ కార్యక్రమంలో యువతతో ముఖాముఖిగా సమావేశమయ్యారు. సమావేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, ఉపాధి అవకాశాలు, భవిష్యత్ అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. పలువురు యువకులు తమ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు, యువత సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న యువతతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. యువత సామాజిక, ప్రజా సమస్యలపై చురుకుగా స్పందించాలని ఆయన సూచించినట్లు సమాచారం.

## ఢిల్లీకి చేరిన నేతల పంచాయితీ



**హైదరాబాద్ సెప్టెంబర్ 1:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. అధికార పార్టీలో అంతర్గత రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. అటు పరిపాలనలో దూకుడు పెంచడం, ఇటు పార్టీలో పెరుగుతున్న అసంతృప్తులు, వివాదాలకు చెక్ పెట్టే లక్ష్యంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఇప్పటికే ఏఐసీసీ గడప తొక్కింది. దీనికితోడు కేబినెట్ ప్రక్షాళనపై కీలక నిర్ణయాలు తీసుకునేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం రంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలోనే సెప్టెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లను ఢిల్లీకి రావాల్సిందిగా అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. విదేశీ పర్యటన ముగించుకుని సెప్టెంబరు 1న ఢిల్లీ చేరుకోనున్న ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్.. పార్టీ అగ్రనేతలతో కలిసి ఈ అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. కేవలం కొండా సురేఖ వ్యవహారానికే పరిమితం కాకుండా, మొత్తంగా ప్రభుత్వం-పార్టీ సమన్వయం, కేబినెట్ మార్పుచేర్పులపైనే ఈ భేటీ ప్రధానంగా సాగనుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. "రాత్రింబవళ్లూ కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాం. గౌరవించి మంత్రి పదవులు ఇస్తే.. ఇంట్లో ఉండే పిల్లలతో ఇష్టం వచ్చినట్లు తిట్టిస్తారా? దేనికైనా హద్దు ఉంటుంది కదా!" అంటూ సీఎం తన సన్నిహితుల వద్ద ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేయడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది.

Printed, Published & Owned by **KANDI SURYA NARAYANA,** Printed at Parthasarathi Offset Printers, Prakasham Bazar, Nalgoda - 508 001, T.G
Editor : **KANDI SURYA NARAYANA,** D.No. 5-6-109/B1, Bottuguda Nalgonda-508 001, T.G. Cell : 98480 52327, , **Email : cheekatívelunewsdaily@gmail.com**